క్లుప్తంగా

కీటక జనితవ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఉదయగిరి: కీటక జనిత వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉదయగిరి సీహెచ్‌సీ వైద్యులు ప్రశాంత్, షిఫ్రా రాహుల్, సింధూర సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఉదయగిరిలో సీహెచ్‌సీలో కీటక జనిత వ్యాధులపై రోగులకు సోమవారం వారు అవగాహన కల్పించారు. దోమకాటుతో మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ, బోదకాలు వంటి వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఇళ్లలో, పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, టీబీ సూపర్‌వైజర్ బీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



ఉదయగిరి రూరల్ : మండలంలోని గుడినరవ రైతుసేవా కేంద్రంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను ఏఓ ఆంజనేయులునాయక్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీపై జీలుగలు కేజీ రూ.61.50, పిల్లిపెసర్లు కేజీ రూ.90కు అందజేస్తున్నామని చెప్పారు. విత్తనాలు అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని నగదు చెల్లిస్తే వెంటనే విత్తనాలను అందజేస్తామని తెలిపారు.

అబ్బీపురంలో విషాద ఛాయలు



చింతగుంట చంద్రారెడ్డి (ఫైల్)

అనుమసముద్రంపేట: మండలంలోని పెద్దబ్బీపురానికి చెందిన చింతగుంట కృష్ణారెడ్డి, కృష్ణమ్మ దంపతుల కుమారుడు చింతగుంట చంద్రారెడ్డి(30) ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృత్యువుపాలవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కృష్ణారెడ్డి దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తె చిన్నతనంలోనే చనిపోగా, ఒక్కగానొక్క కుమారుడ్ని అల్లారుముద్దుగా పెంచారు. ఇంజనీరింగ్ వరకు చదివించారు. చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినప్పటికీ చంద్రారెడ్డి తల్లిదండ్రుల వద్దే ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. అతనికి మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆదివారం రాత్రి ఏఎస్‌పేటలో బైక్, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో చంద్రారెడ్డి మృత్యువాతపడడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

నేటి నుంచి యోగాంధ్ర పోటీలు

వింజమూరు(ఉదయగిరి): యోగాంధ్రలో భాగంగా వింజమూరు మండల స్థాయిలో యోగా పోటీలను ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. 3న 18 ఏళ్లలోపు, 4న 18 నుంచి 35 ఏళ్లలోపు, 5న 35ఏళ్లు పైబడిన వారికి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయ భవన పునర్నిర్మాణ పనులను పీఆర్ డీఈఈ మణికుమార్ సోమవారం పరిశీలించారు. నాణ్యతను పరిశీలించి కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్ నిధులు రూ.27 లక్షలతో భవన పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బెడ్ కాంక్రీట్ పనులు జరుగుతున్నాయన్నారు. పనులను సకాలంలో పూర్తయ్యేలా చూస్తామన్నారు.

గడ్డివామి దగ్ధం

సంగం: స్థానిక ఎర్రచెరువు సమీపంలోని పోలిశెట్టి కృష్ణయ్యకు చెందిన ఆరెకరాల గడ్డివామి సోమవారం దగ్ధమైంది. ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రం అధికారులు మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

దుగ్గిరాలకు నివాళి

సోమశిల: అనంతసాగరంలోని గ్రంథాలయంలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతిని సోమవారం నిర్వహించారు. దుగ్గిరాల చిత్రపటానికి విద్యార్థులతో కలిసి గ్రంథాలయాధికారి నారాయణరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర సంగ్రామంలో దుగ్గిరాల పాత్రను విద్యార్థులకు వివరించారు.

ఆడబిడ్డలకు తీరని ద్రోహం

- వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట
- అమ్మఒడి, సున్నావడ్డీ, చేయూతతో ఆర్థిక భరోసా
- ఎన్నికలకు ముందు ఆడబిడ్డ నిధి ఇస్తామన్న బాబు
- ఏడాది కావస్తున్నా ఊసెత్తని వైనం



కాపునేస్తం నమూనా చెక్కును అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి(ఫైల్)



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళపేరు నూతలపాటి లక్ష్మీదేవి. ఈమెది వరికుంటపాడు మండలం వేంపాడు గ్రామం. ఈమెకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేయూత ద్వారా రూ.70వేలు, ఆసరా ద్వారా రూ.65వేలు, సున్నా వడ్డీ రాయితీ ద్వారా మరో రూ.10వేలు బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. కానీ ఈ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి ప్రయోజనం అందలేదని ఆమె వాపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఆదుకోవాలని కోరింది.

ఉదయగిరి : ఎన్నికల సమయంలో బాబు ష్యూరిటీ..భవిష్యత్ గ్యారెంటీ అంటూ ఊదరగొట్టారు. సూపర్‌సిక్స్ పథలను అమలు చేసి తీరుతామని..18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకు వయస్సు గల ప్రతి మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18వేలు ఆడబిడ్డ నిధి కింద చెల్లిస్తామని..డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు రూ.10 లక్షలకు పెంపు చేస్తామని.. ఆడబిడ్డలను అన్ని విధాలా ఆదుకుంటామని చంద్రబాబు హామీలు గుప్పించారు. అక్కచెల్లెమ్మల మనస్సు కూటమి వైపు మొగ్గుచూపేలా వ్యవహరించి ఓట్లు దండుకున్నారు. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఆడబిడ్డ నిధి హామీ ఆలోచనే చేయలేదు. దీంతో తాము మోసంపోయామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి నియోజవర్గంలో 3.70 లక్షల జనాభా ఉండగా, దాదాపు 50 శాతం మేర మహిళలు ఉన్నారు. అందులో 18 ఏళ్లు పైబడిన 59 ఏళ్లలోపు మహిళలు 30శాతం మంది వరకు ఉన్నారు. చంద్రబాబు ఆడబిడ్డ నిధి ద్వారా ప్రతి కుటుంబంలోని 18ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉచిత బస్సు, సున్నావడ్డీ రుణాల పెంపు, తదితర హామీలు గుప్పించడంతో మహిళలు ఎంతో ఆశ పడ్డారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇదిగో..అదిగో అంటూ ఊరిస్తూ కాలయాపన చేస్తుండడంతో బాబును నమ్మి మోసపోయామని మహిళలు మథనపడుతున్నారు.

గత ప్రభుత్వంలో మహిళలే మహారాణులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఉదయగిరి నియోజకవర్గంలోని మహిళలు ఎంతో లబ్ధిపొందారు. నవరత్నాలు ప్రతి కుటుంబానికి అందాయి. స్వయం సహాయక గ్రూపుల్లోని సుమారు 44వేల మందికి కోట్లాది రూపాయలను వడ్డీ రాయితీ కింద ఇవ్వడం జరిగింది. పేద కాపు సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు ఏడాదికి రూ.15వేలు చొప్పున నాలుగేళ్లకు రూ.8.94 కోట్లు లబ్ధి చేకూరింది. ఈబీసీ నేస్తం ద్వారా పేద మహిళలకు ఏడాదికి రూ.15వేలు ఇచ్చారు. పేద వర్గాలకు చెందిన 45ఏళ్లు నిండిన మహిళలు 50వేల మందికి ఏడాదికి రూ.18,500 చొప్పున అందజేశారు. 10వేల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. 4,816 గృహ నిర్మాణాల కోసం రూ.53కోట్లు మహిళ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. వసతి దీవెన, విద్యాదివెన పథకాల ద్వారా 27.855మంది తల్లుల ఖాతాల్లో రూ.129 కోట్లు జమచేసి పేద ప్రజల గుండెల్లో జగనన్న చెరగని ముద్ర వేసుకున్నారు.



కావలిలో నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

అన్ని వర్గాల ప్రజలకు బాబు మోసం

- ఏడాది గడుస్తున్నా హామీల అమల్లో విఫలం
- ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వెన్నుపోటు దినం
- పట్టణంలో బుధవారం నిరసన ర్యాలీ
- పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలి
- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 4న కావలిలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం ఆయన తన నివాసంలో కావలి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబువి ఎప్పుడూ వెన్నుపోటు రాజకీయాలేనని దుయ్యబట్టారు. నాడు దివంగత ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచాడని, నేడు ఐదు కోట్ల ఆంధ్రులను వెన్నుపోటు పొడుస్తున్నాడన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా రెడ్‌బుక్ రాజ్యాంగంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఎన్నికల హామీలపై ప్రశ్నించకుండా అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తున్నారన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, వారి అవినీతిని, అరాచకాలను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. వలంటీర్లకు రూ. 10 వేలు ఇస్తానని చెప్పి మోసగించారని, ఇంటింటికీ రేషన్‌ను నిలిపేసి మళ్లీ డీలర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలబడే వైఎస్సార్‌సీపీని పార్టీ నాయకులు, కార్యకర్తలే ముందుండి నడిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ఈ సమయంలో పార్టీ నిర్దేశించిన ప్రతి కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం జయప్రదానికి పిలుపు

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ ఉదయగిరి నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ అధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బిట్రగుంట: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4న కావలిలో నిర్వహిస్తున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9 గంటలకు కావలిలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసం నుంచి ర్యాలీ సాగుతుందన్నారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

హెచ్‌ఎంల బాధ్యతల స్వీకరణ



హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ



హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన రవీంద్ర

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా రత్తంశెట్టి రవీంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. కావలి మండలం రుద్రకోట ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై హెచ్‌ఎంగా వచ్చారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు వింజమూరు మండలం కాటేపల్లి ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు.

సీతారామపురం: మండల కేంద్రమైన సీతారామపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ప్రవీణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇందుకూరుపేట మండల నుంచి బదిలీపై సీతారామపురం వచ్చారు. అలాగే ఓగూరువాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా గిరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరులో దర్గామిట్ట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ హెచ్‌ఎంగా పదోన్నతి పొంది ఓగూరువాండ్లపల్లికి బదిలీపై వచ్చారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు: స్కూల్ బస్సులు, వ్యాన్లలో విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఎంవీఐ ఎం రాములు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో స్కూల్ వ్యాన్లు బస్సుల డ్రైవర్లకు రహదారి భద్రతపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ పిల్లల భద్రతను బాధ్యతగా భావించి వాహనాలను నడపాలని సూచించారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతి వేగం, ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, అలా పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



మంటలను అర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కలిగిరి: మండలంలోని పెద్దపాడు–వీరారెడ్డిపాళెం మధ్యన జాతీయ రహదారిపై కారు బోల్తాపడి పూర్తి దగ్ధమైన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు..కావలి నుంచి వరికుంటపాడు మండలం గువ్వాడికి కారును డ్రైవర్ శివ తీసుకెళుతున్నాడు. ఈ క్రమంలో పెద్దపాడు–వీరారెడ్డిపాళెం మధ్యన డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లింది. దీంతో తేరుకున్న డ్రైవర్ వెంటనే కారును రోడ్డుపైకి తిప్పగా అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో కారులో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే కారు అద్దాలు పగులగొట్టి డ్రైవర్ శివను బయటకు తీశారు. స్వల్పగాయాలు కావడంతో కలిగిరిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వింజమూరు అగ్నిమాప సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. ఎస్సై ఉమాశంకర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

రైతులందరికీ వ్యవసాయశాస్త్ర విజ్ఞానం



కరటంపాడులో అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ డీవీకే నాగేశ్వరరావు

ఆత్మకూరురూరల్/మర్రిపాడు: క్షేత్ర స్థాయిలో వ్యవసాయం చేసే ప్రతి రైతుకు వ్యవసాయ శాస్త్ర విజ్ఞానాన్ని అందించడమే ప్రధాన లక్ష్యంగా వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జాతీయ వరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ డీవీకే నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం కరటంపాడు, చెర్లోయడవల్లి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. విచక్షణారహితంగా ఎరువులు వాడకుండా భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా వినియోగించాలని సూచించారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అనువైన వరి వంగడాలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, వరిలో సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త లక్ష్మీప్రసన్న, కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్ రెడ్డి, డీఆర్‌సీ ఏఓ గీతాకుమారి, తదితరులు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏఓ కిశోర్‌బాబు, వీఏఏలు యస్థాని, ప్రత్యూష, కరటంపాడు, చెర్లోయడవల్లి, పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు. అలాగే మర్రిపాడు మండలం కంపసముద్రంలో సజ్జ, రాగి పంటల సాగులో అధిక దిగుబడులు సాధించడానికి చేపట్టాల్సిన చర్యలు, పందులు, కోతులు పంటను నష్టపరచకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నెల్లూరు శాస్త్రవేత్త వినీత, డీఆర్సీ ఏడీఏ మారుతీదేవి నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త హరినాథ్ బావిలో చేపలు పెంచుకునే విధానాలు తెలిపారు. ఏఓ రామ్మోహన్ వ్యవసాయ పథకాలు, అన్నదాత సుఖీభవకు రైతుల రిజిస్ట్రేషన్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

టీటీడీ చైర్మన్‌కు ఆహ్వానం

దుత్తలూరు: నర్రవాడలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆహ్వానించారు. సోమవారం హైదరాబాద్‌లోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయానికి వెళ్లి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, జనార్దన స్వామి ఆలయ చైర్మన్ మాదాల ఎస్ బాబూరావు, టీడీపీ నాయకుడు మల్లంపాటి గురవయ్యనాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

ఉదయగిరి: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే శిక్షణ తరగతుల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం: మండలంలోని సీతారామపురం, కుర్రపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీహరి సోమవారం తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థి కిట్ల పరిశీలన

వరికుంటపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2025 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం పంపిణీ చేయనున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లు మండల విద్యావనరుల కేంద్రానికి చేరుకున్నాయని ఎంఈఓ–2 సీహెచ్ రమణయ్య తెలిపారు. సోమవారం ఆయన విద్యార్థి కిట్లను తనిఖీ చేశారు. తొలి విడతగా పాఠ్య, నోట్‌పుస్తకాలు, బెల్టులు, బ్యాగులు, నిఘంటువులు వచ్చాయని చెప్పారు. ఇంకా షూస్, యూనిఫామ్ రావాల్సి ఉందని తెలిపారు. ఆయన వెంట కంప్యూటర్ ఆపరేటర్ బాలకృష్ణ, సీఆర్పీలు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీఓ సుభాషిణి సోమవారం తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో కూలీల హాజరును పరిశీలించి కొలతల మేరకు పనులు చేపట్టి ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం రూ.350 పొందాలని సూచించారు. నీటికుంటల నిర్మాణ పనులపై దృష్టి పెట్టాలని తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

జలదంకి: మండలంలోని బీకేఅగ్రహారంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన యువతి అదృశ్యంపై తల్లి కావలి బుజ్జమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం నుంచి తన కుమార్తె కనిపించడం లేదని, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు జలదంకి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మల్లికార్జున

మర్రిపాడు/దుత్తలూరు: మర్రిపాడు, దుత్తలూరులో మండలాల్లో సోమవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మర్రిపాడు మండలం తిక్కవరం పంచాయతీకి చెందిన మల్లికార్జున ద్విచక్రవాహనంపై డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రాత్రి వస్తున్నాడు. పొగాకు వేలం కేంద్రం సమీపంలో మరమ్మతులకు గురైన లారీ వద్ద ఏర్పాటు చేసిన రాళ్లను గుర్తించక మోటార్‌సైకిల్‌ను ఎక్కించాడు. దీంతో వాహనం అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని టోల్ ప్లాజా అంబులెన్స్‌లో ఆత్మకూరులోని ఆస్పత్రికి తరలించారు. అలాగే బెంగళూరుకు చెందిన బీ నాగరాజు దుత్తలూరు మండలం మీదుగా కలిగిరి మండలం జిర్రావారిపాళెంలోని అత్త గారింటికి మోటా ర్‌సైకిల్‌పై బయలుదేరి వెళ్తున్నాడు. బ్రహ్మేశ్వరం వద్ద ముందు వెళ్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఉదయగిరి ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆత్మకూరుకు తరలించారు.

నష్టపరిహారం అందించాలని రైతుల వినతి



కావలి ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

దగదర్తి: తమ భూములను 30 ఏళ్ల క్రితం ఇఫ్కో కిసాన్ సెజ్‌కు సేకరించారని, ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదని, వెంటనే అందజేసేలా చర్యలు తీసుకోవాలని దగదర్తి మండలానికి బాధిత రైతులు కోరారు. ఈ మేరకు కావలి ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ వంశీకృష్ణకు వినతి పత్రం అందించారు. ఊచగుంటపాళెం గ్రామ పరిధిలోని 112 మంది రైతుల నుంచి సుమారు 196 ఎకరాలు, శ్రీరామపురం గ్రామ పరిధిలోని 17 మంది రైతుల నుంచి 43 ఎకరాలను ఇఫ్కో సంస్థ స్వాధీనం చేసుకుందని విన్నవించారు. అప్పట్లో తమకు నష్టపరిహారంగా సాగు భూమితో పాటు నగదును అందజేస్తామని చెప్పడంతో భూములను స్వాధీనం చేశామని తెలిపారు. నష్టపరిహారం కోసం తిరిగి తిరిగి అలసిపోయామని వాపోయారు. అధికారులను కలిస్తే ఇఫ్కో సంస్థ వద్దకు వెళ్లమని చెబుతున్నారని, వారిని కలిస్తే సమాధానం చెప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



అల్లూరులో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అల్లూరు: స్థానిక కోనేటి సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ సందర్భంగా ఉదయం సుప్రభాతం సేవ, మహాగణపతి హోమం, ఆంజనేయస్వామికి 108 లీటర్ల పాలతో అభిషేకం, పంచామృతాభిషేకం, అగ్నిప్రతిష్ఠ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కేఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

కనులపండువగా సీతారాముల గ్రామోత్సవం

కొండాపురం : మండలంలోని కొమ్మిలో మూడ్రోజులుగా జరుగుతున్న సీతారాముల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను హనుమంతునిపై కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. కుమ్మరి కులస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సోమవారం వడ్డెర కులస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించి సీతారాములకు ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

108లో ప్రసవం.. కవల పిల్లలకు జననం

సీతారామపురం : మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరి సోమవారం 108 వాహనంలో ప్రసవించింది.సోమవారం సాయంత్రం ఆమె కాన్పు కోసం సీతారామపురం పీహెచ్‌సీకి రాగా వైద్యసిబ్బంది ఉదయగిరి సీహెచ్‌సీకి రెఫర్ చేశారు. 108 వాహనంలో ఆమెను ఉదయగిరికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో సర్వరాబాదు వద్ద నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ వెంకటశ్రీనివాసులు, పైలట్ మధు, ఆశాకార్యకర్త లక్ష్మీకుమారి కలిసి సురక్షితంగా కాన్పు చేసి ఆడపిల్లకు జన్మనిచ్చారు. అనంతరం తల్లీబిడ్డను ఉదయగిరి సీహెచ్‌సీకి తరలించగా అక్కడ మరో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లితో పాటు కవల పిల్లలు క్షేమంగా ఉన్నారు.

సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా



సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా కొట్టడంతో ఖాళీగా కుర్చీలు

ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లి గ్రామసచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదు. వివిధ సమావేశాల పేరుతో క్షేత్రస్థాయిలో విధులకు హాజరుకాకుండా డుమ్మా కొడుతుండడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో పది మంది ఉద్యోగులుండగా సోమవారం కేవలం ఇద్దరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు వెనుదిరిగారు. కాగా సచివాలయ సిబ్బంది కొందరు ఉదయాన్నే వచ్చి హాజరువేసుకుని వెళ్లిపోతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. మండల ఉన్నతాధికారులు దృష్టి సారించి విధులకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.